రైతుల బోనస్ ఎగవేతకు సర్కార్ కుట్ర

- నెల రోజులుగా అందని డబ్బులు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఫైర్

నర్సంపేట, జనవరి 10 : రైతుల బోనస్ ఎగవేతకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రచేస్తున్నదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన వరంగల్ జిల్లా నర్సంపేటలో మీడియాతో మాట్లాడారు. నెల రోజులుగా రైతులకు బోనస్ అందలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఎగవేతకు సన్నాలకు బోనస్‌తో కుట్ర చేసిందని ఆరోపించారు. రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ చెల్లించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. బోనస్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రైతు నెత్తిన కుచ్చుటోపి పెట్టిందని దుయ్యబట్టారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 33,958 మంది రైతులకు రూ.85.24 కోట్ల బోనస్ డబ్బులు రాలేదని తెలిపారు. ఇది కాంగ్రెస్ దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం బోనస్ డబ్బులు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. యూరియా కొరత, కరెంటు కోత, రైతుభరోసా, బోనస్ అందక రైతులు గోస పడుతున్నారని తెలిపారు.

రైతు ఆత్మహత్య

- దిగుబడులు రాక.. ఆర్థిక భారం
- వరంగల్ జిల్లాలో అన్నదాత బలవన్మరణం

అశోక్ (ఫైల్)

ఖానాపురం, జనవరి 10 : దిగుబడులు రాక, ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక వరంగల్ జిల్లా ఖానాపురం మండలం మనుబోతలగడ్డలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం మనుబోతలగడ్డకు చెందిన అమ్మ అశోక్ (45) ఎకరం పొలంలో ఈ ఏడాది దిగుబడి రాలేదు. పెట్టుబడితోపాటు కుటుంబ పోషణకు కలిపి మొత్తం రూ.5.5 లక్షల అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం కానరాక కొంత కాలంగా తీవ్ర మనస్తాపంతో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి కలుపు నివారణ మందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారమిచ్చాడు. కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న అశోక్‌ను నర్సంపేటకు వైద్యశాలకు తరలించే క్రమంలో మృతిచెందాడు. భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రఘుపతి తెలిపారు.

నారుమడిలో.. రైతు గుండెతడిలో కేసీఆర్

సూర్యాపేట జిల్లా నాగారం మడలం నాగారం బంగ్లా గ్రామానికి చెందిన యువరైతు బెల్లి నరకేశ్ తన పొలంలోని నారుమడిలో కేసీఆర్ అంటూ నారు వేసి అభిమానాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల పాటు రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. తాను పండించే పంట లోనూ కేసీఆర్‌ను చూసుకుంటున్నానని తెలిపారు. – నాగారం

యాసంగిలో సాగు సంకటం!

మొదటిపేజీ తరువాయి...

నీరు అందుబాటులో ఉన్నట్టు రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (ఎస్‌సీఐఈఏఎం) లెక్క తేల్చింది. ఈ యాసంగి సీజన్‌లో మొత్తంగా 42.48 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలని ప్రతిపాదించింది. మేజర్ ప్రాజెక్టుల్లో 277.59 టీఎంసీల నీరు అందుబాటులో ఉండగా, వాటి కింద 30.96 లక్షల ఎకరాలకు, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో 30.38 టీఎంసీల నిల్వ ఉండగా 2.68 లక్షల ఎకరాలకు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో అందుబాటులో ఉన్న 37.40 టీఎంసీలతో 7.23 లక్షల ఎకరాలకు, ఐడీసీ లిఫ్టుల కింద 9.5 టీఎంసీలతో 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని అంచనాలు రూపొందించారు. వెట్‌క్రాప్స్‌కు 24.54 లక్షల ఎకరాలు, ఐడీ క్రాప్స్‌కు 17.94 లక్షల ఎకరాలు మొత్తంగా 42.48 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కమిటీ తైబందీ ఖరారు చేసింది. జనవరి 1 నుంచి మార్చి 31వ తేదీ వరకు ఆన్ అండ్ ఆఫ్ సిస్టమ్‌లో అంటే వారం విడిచి వారం మొత్తంగా సగటున మొత్తంగా 6 తడులను అందించాలని కమిటీ నిర్ణయించింది. ఆ మేరకు ఇప్పటికే పలు ప్రాజెక్టుల అధికారులు కాలువల ద్వారా సాగునీటి విడుదలను కూడా ప్రారంభించారు. అయితే నిర్దేశిత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించడం కష్టమేనని ప్రస్తుతం క్షేత్రస్థాయి ఇంజినీర్లు వివరిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పరిస్థితులకు విరుద్ధంగా..

రాష్ట్ర స్థాయి కమిటీ రూపొందించిన అంచనాలు క్షేత్రస్థాయి పరిస్థితులకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయని ఫీల్డ్ ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వరి, ఆరుతడి పంటలకు తైబందీ ఖరారు చేశారని కానీ, క్షేత్రస్థాయిలో రైతులు మాత్రం అంచనాలకు మించి వరి ఎక్కువగా సాగు చేశారని, ఆరుతడి పంటలను తక్కువ మొత్తంలో సాగు చేశారని తెలుపుతున్నారు. ప్రస్తుతం వరితోపాటు, ఇతర పంటల సాగు ఇప్పుడే ప్రారంభమైందని, ఈ దశలో కావాల్సిన నీటి పరిమాణం తక్కువగానే ఉంటుందని వివరిస్తున్నారు. అదీగాక ప్రస్తుతం గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కాలువ నీటిపై ఎక్కువగా ఆధారపడే పరిస్థితులు లేవని చెబుతున్నారు. అయితే మున్ముందు తేమ శాతం తగ్గడంతోపాటు, పంటలు ఎదిగే దశలో నీటి పరిమాణం ఎక్కువ అవసరమని వివరిస్తున్నారు. ఆ దశ వచ్చేనాటికి ప్రస్తుతమున్న నీటినిల్వలు సరిపోయే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదీగాక వివిధ ప్రాజెక్టుల ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, మైనర్ కాలువలు పూడిక పేరుకుపోయి, కంపచెట్లు విపరీతంగా పెరిగి నీటి సరఫరాకు అనుకూలంగా లేవని చెబుతున్నారు. ఆయా కాలువల్లో డిజైన్ సామర్థ్యం మేరకు సాగునీరు ప్రవహించని దుస్థితి నెలకొన్నదని క్షేత్రస్థాయి ఇంజినీర్లు వాపోతున్నారు. నీటి రవాణా నష్టాలు కూడా ఎక్కువ మొత్తంలో ఉంటున్నాయని వివరిస్తున్నారు. కొన్నిచోట్ల పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేసినా కాలువల చివరి ఆయకట్టుకు ఇప్పుడే నీరందని దుస్థితి నెలకొన్నదని నొక్కిచెబుతున్నారు. మరోవైపు కాలువల పొడవునా రైతులు మోటర్లను ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ నీటిని వినియోగిస్తున్నారని, వెరసి దిగువకు నిర్దేశించిన మొత్తం కంటే తక్కువగానే నీరు వెళ్తున్నదని తెలుపుతున్నారు. మొత్తంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా అంచనాల మేరకు సాగునీటి నిల్వలు లేవని ఫీల్డ్ ఇంజినీర్లు ఉన్నతాధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేశారు. దీంతో యాసంగిలో సాగునీరు పూర్తిస్థాయిలో అందడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికే పలు చోట్ల చేతులెత్తేసిన వైనం..

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది అత్యధికంగా వర్షాలు కురిశాయి. ప్రధాన ప్రాజెక్టులన్నీ పొంగిపొర్లాయి. అయినప్పటికీ ప్రస్తుతం యాసంగి సీజన్‌లో పలు ప్రాజెక్టుల కింద సాగునీరివ్వలేమని అధికారులు చేతులెత్తేసిన దుస్థితి నెలకొన్నది. ఇతర ప్రాజెక్టుల కింద కూడా అత్తెసరు నీటితోనే సరిపెట్టేందుకు అధికారులు నిర్ణయించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అందులో 70 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ, వేసవి తాగునీటి అవసరాలు పోగా నికరంగా 60 టీంఎసీలకు మించి వాడుకోలేని పరిస్థితి. ఎస్సారెస్పీ నుంచి ఎల్ఎండీ ఆయకట్టుకే ఆ నీరు సరిపోని దుస్థితి. ఇక ఎస్సారెస్పీపై ఆధారపడిన లిఫ్టులకు అదనంగా నీరు అవసరముంటుంది. ఇట్లాంటి పరిస్థితుల్లో ఎస్సారెస్పీ నుంచి దిగువకు 5 టీఎంసీలను ఎల్ఎండీకి విడుదల చేసి సాగునీరందించాలని నిర్ణయించారని ఇంజినీర్లు వివరిస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఎల్ఎండీలో 20.78 టీఎంసీలు, శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ (ఎంఎంఆర్)లో 22.34 టీఎంసీల నీళ్లు నిల్వ ఉండగా, అందులో మిషన్ భగీరథ, తాగునీటి అవసరాలకు పోగా నికరంగా 2 ప్రాజెక్టుల నుంచి 25 టీఎంసీలకు మించి అందుబాటులో ఉండని పరిస్థితి. ఎస్సారెస్పీ నుంచి 5 టీఎంసీలు వచ్చినా మొత్తం 30 టీఎంసీలే. అయితే కాకతీయ కెనాల్ ఎల్ఎండీ 146-284 కి.మీ. వరకు 5,05,720 ఎకరాలు, అదే విధంగా 284 కిలోమీటర్ నుంచి 347 కిలోమీటరు వరకు ఎస్సారెస్పీ స్టేజ్- 2 కింద 3,71,691 ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఈ ఆయకట్టు మొత్తానికి సాగునీరందించేందుకు 60 టీఎంసీలు అవసరం. కానీ, అధికారులు 30 టీఎంసీలతోనే, అదీ ఆరు తడులతోనే సరిపెడతామని ఇప్పటికే వెల్లడించారు. క్షేత్రస్థాయిలో చాలా చోట్ల సాగునీరివ్వలేమని ముందే చేతులెత్తేసిన పరిస్థితి ఉన్నది. జలాలు సమృద్ధిగా అందుబాటులో లేని కారణంగా మిడ్‌మానేరు ఎగువకు నీరివ్వలేమని అధికారులు ఇప్పటికే తేల్చిచెప్పారు. వాస్తవంగా కాళేశ్వరం ప్యాకేజీ 10, 11, 12, జగదేవ్‌పూర్, గజ్వేల్, రామాయంపేట్, తుర్కపల్లి, ఉప్పరపల్లి కెనాళ్ల కింద మొత్తంగా దాదాపు లక్ష ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రతీ యాసంగి సీజన్‌లోనూ రాజరాజేశ్వర జలాశయం నుంచి అనంతగిరి, అక్కడి నుంచి రంగనాయక సాగర్‌కు జలాలను తరలించి సాగునీటిని అందిస్తున్నారు. అయితే ఈ ఏడాది సాగునీటిని అందించలేమని అధికారులు చేతులేత్తారు.

ప్రధాన ప్రాజెక్టుల వారీగా నీటి నిల్వలు (టీఎంసీల్లో)..

ప్రాజెక్టు	పూర్తినిల్వ సామర్థ్యం	ప్రస్తుతం
శ్రీరాంసాగర్	90	70.19
శ్రీరాజరాజేశ్వర జలాశయం	27.50	22.34
లోయర్ మానేర్ డ్యాం	24	20.78
ఎల్లంపల్లి	20	18.54
సింగూరు	29.17	27.72
నిజాంసాగర్	17.80	14.84
కడెం	7.60	6.26
జూరాల	9.66	7.35
నాగార్జునసాగర్	312	251.31
శ్రీశైలం	215	107.71

కృష్ణా బేసిన్‌లో మరీ దారుణం...

ఇక కృష్ణా బేసిన్‌లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కృష్ణమ్మ పొంగిపొర్లినా యాసంగి సాగుకు నీరులేని దుస్థితి నెలకొన్నది. జూరాల, భీమా ప్రాజెక్టుల కింద పూర్తిస్థాయిలో నీరివ్వలేమని అధికారులు తేల్చిచెప్పారు. ఇక కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో ప్రస్తుతం 3 పంపులే నడుస్తుండగా, ప్రాజెక్టు కింద దాదాపు 2.50 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్నది. శ్రీశైలంలో జలాలు ఉన్నా పూర్తిస్థాయిలో ఎత్తిపోయలేని దుస్థితి. మొత్తంగా యాసంగి పంట చేతికొచ్చేవరకు సాగునీరందే పరిస్థితి లేదని క్షేత్రస్థాయి అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా రైతులను అప్రమత్తం చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

లోకం పోకడ



చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	6.8°c	34.5°c
రంగారెడ్డి	10.6°c	31.6°c
మెదక్	12.4°c	32.1°c
నిజామాబాద్	14.4°c	30.4°c
హైదరాబాద్	15.0°c	27.3°c
వరంగల్	16.0°c	28.0°c
ఖమ్మం	16.0°c	30.0°c
కరీంనగర్	16.0°c	28.0°c
నల్లగొండ	16.8°c	28.2°c
మహబూబ్‌నగర్	17.0°c	28.0°c

ఉపరితల ఆవర్తనం పెరుగనున్న చలి

హైదరాబాద్, జనవరి 10 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం మరో నాలుగు రోజులు కొనసాగనున్నదని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో చలి తీవ్రత పెరుగనున్నదని తెలిపింది. మరోవైపు రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగల్ డిజిట్‌గా నమోదయ్యాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణీలో 6.8 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్‌లో 7 డిగ్రీలు, నిర్మల్ జిల్లా పెంబీలో 9.1 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా న్యాల్కల్‌లో 9.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి.

చివరి ఆయకట్టుకు నీరందించాలి

ఎస్సారెస్పీపై సమీక్షలో మంత్రి ఉత్తమ్ ఆదేశం

హైదరాబాద్, జనవరి10 (నమస్తే తెలంగాణ): చివరి ఆయకట్టుకు తగినంత నీరందించాలని ఇరిగేషన్‌శాఖ అధికారులను సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధిలోని చివరి ఆయకట్టుకు తగినంత నీరు రావడం లేదని రైతులు ఇప్పటికే స్థానిక నేతల దృష్టికి తీసుకువస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్సారెస్పీ సాగునీటి విడుదలపై జలసౌధలో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని మంత్రి ఉత్తమ్ శుక్రవారం నిర్వహించారు. నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఈఎన్‌సీలు అనిల్‌కుమార్, విజయభాస్కర్‌రెడ్డి, హరిరాం, సీతాలు కే శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, రమేష్‌బాబును క్షేత్రస్థాయి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఎస్సారెస్పీ పరిధిలో యాసంగి సీజన్‌లో మొత్తం 9.68 లక్షల ఎకరాలకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా ఏప్రిల్ 8 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

కృష్ణాజలాల సరఫరాపై వారంలో నివేదిక

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు నిరవధికంగా కృష్ణాజలాల సరఫరాకు నీటిపారుదల శాఖ, జలమండలి అధికారులు వారంలోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో వారు ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టును త్వరలో సందర్శించనున్నారు. నగర నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల సీఎం తన సమీక్షలో ఆదేశించారని జలమండలి అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత నీటిమట్టం తర్వాత సుంకిశాల ప్రాజెక్టులోని మధ్య టన్నెల్‌ను మూసివేయడంతోపాటు ఇన్‌టేక్ వెల్‌లోని నీటిని తోడేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిరుడు ఆగస్టులో జరిగిన ఘటన తర్వాత చేపట్టాల్సిన పనులపై నివేదిక కోసం టీసీఈ అనే కన్సల్టెన్సీని నియమించామని, ఆ నివేదిక ప్రకారం నిర్మాణ సంస్థ తన సొంత ఖర్చులతో పనులను చేపట్టనున్నట్టు ధ్రువీకరణ ఇచ్చిందని జలమండలి అధికారులు తెలిపారు.

పని ఒత్తిడితో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ఆత్మహత్య!

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ బాచుపల్లిలో ఓ ప్రైవేటు బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ సత్యలావణ్య(32) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురానికి చెందిన సత్యలావణ్య తన భర్తతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. సంక్రాంతికి భర్తతో కలిసి స్వస్థలానికి వెళ్లేందుకు బ్యాంకులో సెలవు అడిగినట్టు తెలుస్తున్నది. సెలవు మంజూరు అయిందా లేదా అనే విషయం తెలియరాలేదు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం ఆమె బ్యాంకు నుంచి ఇంటికి వచ్చి, ఆత్మహత్యాయత్నం చేశారు. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను గుర్తించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించారు. అప్పటికే సత్యలావణ్య మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కుటుంబసభ్యులు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో పని ఒత్తిడి ఎక్కువగా ఉందంటూ సత్యలావణ్య తరచుగా చెప్పేవారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని బాచుపల్లి పోలీసులు తెలిపారు.

డాటాలోనూ తొండాట!

మొదటిపేజీ తరువాయి...

సర్కారు... ఘటనకు తామే బాధ్యులమని ఏజెన్సీ లిఖితపూర్వకంగా తెలిపినా చర్యల విషయంలో తాత్సారం చేస్తున్నది. రిటెయినింగ్ వాల్ కూలిన ఘటనను గోప్యంగా ఉంచినట్టే.. నిర్మాణ కంపెనీ మేఘాపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నదో చెప్పకుండా దాచేస్తున్నారు. ఈ ఘటనపై విజిలెన్స్ విచారణ జరిపిన ప్రభుత్వం ఆ నివేదికను బయటపెట్టడం లేదు. రిటెయినింగ్ వాల్ కూలడానికి కారణమైన నిర్మాణ కంపెనీ మేఘాపై తీసుకున్న చర్యలపై విజిలెన్స్ విచారణ నివేదిక ఇవ్వాలంటూ సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్ ఆర్టీఐ చట్టం ద్వారా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగాన్ని కోరారు. 2024 నవంబర్ 12న ఆయన నివేదిక ఇవ్వాలని కోరగా గురువారం సమాచార హక్కు చట్టంలోని సెక్షన్-8 ప్రకారం నివేదిక ఇవ్వలేమని ఎంఏయూడీ నుంచి లేఖ రూపంలో సమాధానం పంపించారు. దేశ భద్రతతో ముడిపెట్టి ఈ సమాచారాన్ని ఇవ్వకుండా గోప్యత పాటించడం విస్మయానికి గురిచేస్తున్నది. వాస్తవానికి, నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో అంచనా వేయలేకపోయామని, తద్వారానే రిటెయినింగ్ వాల్ కుప్పకూలిందంటూ నిర్మాణ సంస్థ మేఘా తన తప్పిదాన్ని అంగీకరించింది. జలమండలి గతంలో ఇచ్చిన నోటీసుకు ఇచ్చిన సమాధానంలో ఇదే విషయాన్ని ఒప్పుకున్నది. తమ సొంత ఖర్చుతో వాటిని పునరుద్ధరిస్తామని తెలిపింది. మేఘా తన తప్పును అంగీకరించినందున ఆ సంస్థ సొంత ఖర్చుతోనే మరమ్మతు పనులు చేయాల్సి ఉంటుంది. కానీ, మరికొన్ని నెలల్లో అందుబాటులోకి వచ్చి హైదరాబాద్ తాగునీటి సరఫరాకు శాశ్వత భరోసానను కల్పించే సుంకిశాల పథకం ఈ తప్పిదంతో అందుబాటులోకి రాకుండాపోయింది. ఎప్పుడో అందుబాటులోకి వస్తుందో అటు నిర్మాణ సంస్థ, ఇటు ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేకపోతున్నాయి. మేఘా తన తప్పిదాన్ని అంగీకరించిన దరిమిలా ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తుంది. అధికారులపై చర్యలు తీసుకొని, మేఘాను వదిలివేయడంపై తీవ్రస్థాయిలో విమర్శలొస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. కనీసం విచారణ కమిటీ నివేదిక, తీసుకున్న చర్యలను ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన జలమండలి దీనిపై గోప్యత పాటించడం అనుమానాలకు తావిస్తున్నది.

సెక్షన్ 8 ఏం చెప్తున్నది?

సమాచార హక్కు చట్టం ద్వారా సుంకిశాల ఘటనపై విజిలెన్స్ విచారణ నివేదిక ఇవ్వాలని కోరితే, ఈ ఘటన సెక్షన్-8 కిందకు వస్తుందని, సమాచారం ఇవ్వలేమని ఎంఏయూడీ తెలిపింది. కానీ, సమాచార హక్కు చట్టంలోని సెక్షన్-8 ప్రకారం.. భారతదేశ రక్షణ వ్యవహారాలు, దేశ భద్రతకు విఘాతం కలిగించే సమాచారం, భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రతలపై ప్రతికూల ప్రభావం చూపే సమాచారం ఇవ్వకూడదు. వ్యూహాత్మక, ఆర్థిక, వైజ్ఞానిక, విదేశీ సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపే సమాచారం బయటకు చెప్పకూడదు. ఏదైనా సమాచారం బయటకు చెప్పకూడదని కోర్టు ఆదేశిస్తే, ఆ సమాచారం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందనుకుంటే బయటకు చెప్పకూడదు. కానీ, సుంకిశాల రిటెయినింగ్ వాల్ కూలిన ఘటనలో నిర్మాణ సంస్థ వైఫల్యం ఉన్నది. దానిపై ఏ చర్యలు తీసుకున్నారో తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుంది. ఈ ప్రాజెక్టు పూర్తిగా ప్రజల సొమ్ముతో కడుతున్నదే. ఈ ఘటనకు సమాచార హక్కు చట్టంలోని సెక్షన్- 8 వర్తించదని నిపుణులు చెప్తున్నారు.

సమాచార కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్తాం: గవినోళ్ల శ్రీనివాస్

సుంకిశాల రిటెయినింగ్ వాల్ కూలిన ఘటనపై విచారణ.. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్- 8 కిందకు రాదని సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేఘా కంపెనీని ఈస్ట్ ఇండియా కంపెనీ అన్నారు. అధికారంలోకి రాగానే బ్లాక్‌లిస్ట్‌లో పెడతామన్నారు. మేఘా కంపెనీ తెలంగాణ సంపదను దోపిడీ చేస్తున్నదంటూ తీవ్రమైన ఆరోపణలు చేశారు. మరి, నేడు సుంకిశాల రిటెయినింగ్ వాల్ కూలడానికి కారణమైన మేఘా కంపెనీపై ఎలాంటి చర్యలు తీసుకున్నారంటే సమాచారం ఇవ్వడానికి ఎందుకు భయపడుతున్నారు? మేఘా కృష్ణారెడ్డికి రేవంత్‌రెడ్డి అమ్ముడుపోయారా? లొంగిపోయారా?' అని గవినోళ్ల శ్రీనివాస్ ప్రశ్నించారు. తాను అడిగిన సమాచారం ఎంఏయూడీ ఇవ్వకపోతే, మేఘా కంపెనీకి మద్దతిచ్చినట్టే అవుతుందని చెప్పారు. దీనిపై సమాచార కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. విజిలెన్స్ నివేదిక బహిర్గతమైతే. సీఎం రేవంత్‌రెడ్డి, మేఘా కృష్ణారెడ్డి మధ్య జరిగిన చీకటి ఒప్పందం వెలుగు చూస్తుందనే సమాచారం ఇవ్వడంలేదని ఆరోపించారు. విజిలెన్స్ నివేదికను బయటపెట్టి ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

రైతులతో కలిసి దమ్మన్నపేట వద్ద గోదావరి నదిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పంట పొలాలు ఎండుతున్నయ్

- సాగునీరిచ్చి రైతులను ఆదుకోండి
- మంత్రి ఉత్తమ్‌కు కొప్పుల వినతి
- దమ్మన్నపేట వద్ద ఎండిన గోదావరిని పరిశీలించిన మాజీమంత్రి కొప్పుల

ధర్మపురి, జనవరి 10 : నీళ్లు లేక గోదావరి నది ఎడారిని తలపిస్తున్నదని, ఈ సీజన్‌లో సాగునీరందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం ఆయన జగిత్యాల జిల్లాలోని ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు రైతులు కలిశారు. ఈ సీజన్‌లో సాగునీరందక పంట పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉన్నదని, ఉన్నతాధికారులతో మాట్లాడి ఎస్సారెస్పీ ద్వారా నీరందించేలా చూడాలని వేడుకున్నారు. వెంటనే ఆయన రైతులతో కలిసి దమ్మన్నపేట వద్ద ఎండిన గోదావరిని పరిశీలించారు. అనంతరం కొప్పుల మీడియాతో మాట్లాడుతూ యాసంగి సీజన్ ప్రారంభమైనప్పటి నాట్లు చివరి దశకు చేరుకున్న తరుణంలో గోదావరిలో నీరులేక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. గతంలో నిండుకుండలా ఉన్న గోదావరి ప్రస్తుతం నీరులేక ఎడారిని తలపిస్తున్నదని పేర్కొన్నారు. కమ్మునూర్, మంగేళ, బోర్నపల్లి నుంచి ధర్మపురి వరకు గోదావరి ఆధారంగా 18 లిఫ్టులు నడుస్తున్నాయని తెలిపారు. రైతులు నాట్లు వేసుకున్నారని, నీటి తడుల కోసం ఎదురుచూస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు ఇస్తదో లేదో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. అప్పట్లో కేసీఆర్ గోదావరి నది, చెరువులు, కుంటలు, వాగులు, చెక్‌డ్యామ్‌లను నిండుకుండల్లా ఉంచి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. యాసంగి సీజన్‌లో కూడా చెరువులు మత్తళ్లు దుంకాయని తెలిపారు. ఎప్పుడు అవసరం వచ్చినా మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో మాట్లాడి ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేయించానని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అన్నారు.

మంత్రి ఉత్తమ్‌కు ఫోన్

గోదావరిని పరిశీలించిన తర్వాత కొప్పుల ఈశ్వర్.. మంత్రి ఉత్తమ్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించారు. సాగు నీళ్లు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. వెంటనే ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సూచించారు. స్పందించిన మంత్రి త్వరలో కలెక్టర్, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.



కొంగరకలాన్‌లో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న అధికారులు, రైతులు

ప్రాణం పోయినా మా భూములివ్వం

- మా శవాలపై ఫోర్త్ సిటీ రోడ్డు వేయండి
- గ్రామసభలో స్పష్టంచేసిన రైతులు

ఆదిబట్ల, జనవరి 10: "మా ప్రాణం పోయినా ఫోర్త్ సిటీకి మా భూములు ఇవ్వం, మీరు బలవంతంగా రోడ్డు వేయాలంటే మా శవాల మీదుకెళ్లి రోడ్డు వేయాలి" అని ఫోర్